క్లుప్తంగా

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): శోభకృత నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ డీ హరిత చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి, సభ్యులు కేవీ రత్నం, పీ ప్రదీప్, కే విజయలక్ష్మి, రఘురామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓవెల్ విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు (అర్బన్): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభకనబరిచారు. జాతీయస్థాయిలో ఫిబ్రవరి 5న నిర్వహించిన నిఫ్ట్ ప్రవేశ పరీక్షలో విద్యార్థినులు ఆదిలక్ష్మి, జాహ్నవి, గ్రేస్ ఏంజెల్ రాణించి ద్వితీయ స్థాయి పరీక్షకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల మేనేజింగ్ డైరెక్టర్, ప్రిన్సిపల్ వేణు అభినందించారు. కళాశాల సీఈఓ ప్రమీల, మహదేవన్, గంగాధర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి



నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకటరావు మండలాధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. కూలీలు చేపట్టిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాన్ని నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

నెల్లూరు(బృందావనం): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉరందూరు సురేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర శాసన సభా సమావేశాల్లో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం పంపినట్లు తెలిపారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం ఏఐసీఎఫ్ గత 26 ఏళ్లుగా శాంతియుతంగా, ప్రజాస్వామ్య విధానంలో ఉద్యమిస్తోందని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో అప్పటి సీఎం వైఎస్సార్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని తీర్మానం చేశారని గుర్తుచేశారు. అలాగే జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక అమలు కోసం ఏఐసీఎఫ్ దేశసర్వోన్నత న్యాయస్థానంలో కేసు వేసిందన్నారు. ఈ కేసు చివరిదశలో ఉందని వివరించారు.

'అమరజీవి-మూర్తిమత్వం' సదస్సుకు నెల్లూరీయులు

నెల్లూరు(బృందావనం): మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ సంయుక్తంగా చెన్నైలోని మెరీనా ఆవరణంలోని రజతోత్సవ ప్రాంగణంలో ''అమరజీవి-మూర్తిమత్వం'' జాతీయ సదస్సును గురువారం నిర్వహించనున్నారు. ఈ సదస్సులో నెల్లూరుకు చెందిన కవులు, రచయితలు టీ వెంకటప్పయ్య, చిన్నినారాయణరావు, తదితరులతో పాటు తాను పాల్గొంటున్నట్లు అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ బుధవారం తెలిపారు. అమరజీవి జయంతి సందర్భంగా ఆయన జీవితానికి సంబంధించి పలు అంశాలపై వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు రచయితలు, కవులు పత్రసమర్పణ చేయనున్నట్లు వివరించారు.

డ్వామాలో సోషల్ ఆడిట్

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్‌ను బుధవారం డ్వామా కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పొదలకూరు మండలానికి సంబంధించిన సోషల్ ఆడిట్‌ను డ్వామా కార్యాలయంలో డ్వామా ఏపీడీ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పొదలకూరు మండలంలోని మొత్తం 30 పంచాయతీల్లో చేపట్టిన పనుల రికార్డులను పరిశీలించారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి



పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

నెల్లూరు సిటీ: ఆస్తి, కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో బుధవారం కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్తసేకరణ పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలన్నారు. ట్రేడ్‌లైసెన్స్‌లపై వ్యాపారులకు అవగాహన కల్పించి ప్రతిఒక్క దుకాణదారుడికి ట్రేడ్‌లైసెన్స్ ఉండేలా చూడాలన్నారు. మార్చి 31వ తేదీలోగా పన్నుల వసూళ్లను పూర్తిస్థాయిలో చేపట్టాన్నారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను పూర్తిచేయకపోతే సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లోని గృహాలను ఉగాది నాటికి లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్‌హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, ఎస్ఈ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

వేసవిలో నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే నీరు ఎక్కడా లీకేజీ కాకుండా చూడాలన్నారు. 15వ ఆర్థిక సంవత్సరం, సాధారణ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, డీఈ సురేష్ పాల్గొన్నారు.

చేనేతను ప్రోత్సహించాలి

• కలెక్టర్ చక్రధర్‌బాబు



చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించి వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చక్రధర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే చేనేత వస్త్రాలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు కోరారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రాష్ట్ర చేనేత, జౌళి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్టేట్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో-2023'ను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలు ఎంతో హుందాగా ఉంటాయన్నారు. చేనేతను నమ్ముకుని రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు బతుకుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం నేతన్నలకు బాసటగా నిలుస్తూ వారి కోసం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. చేనేత వస్త్ర ప్రదర్శనల ద్వారా నేత కార్మికులను ప్రోత్సహిస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలను విరివిగా కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని కోరారు. జిల్లా చేనేత, జౌళి శాఖ, సెట్నెల్, నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన రెండు వారాల పాటు ఉంటుందని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఏడీ ఆనందకుమార్, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, నాబార్డు డీడీఎం రవీసింగ్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి, సమీవుల్లా

నెల్లూరు(బృందావనం): రోటరీ క్లబ్ నెల్లూరు ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులకు ఈ నెల 21న ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొండాశేఖర్‌రెడ్డి, సమీవుల్లా తెలిపారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని క్లబ్‌లో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో విద్య, వైద్య, కళా, వ్యవసాయ, సామాజిక, న్యాయ, పారిశుధ్య, తదితర రంగాలకు చెందిన వారి నుంచి పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆయా రంగాలకు చెందిన వారు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు రోటరీక్లబ్ నెల్లూరు మేనేజర్ 95428 30347 నంబరులో సంప్రదించాలని సూచించారు. క్లబ్ సహాయ కార్యదర్శులు ఉదయభాస్కర్, టీ శేఖర్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు సంతాపం

నెల్లూరు(లీగల్): ఇటీవల మరణించిన నెల్లూరు న్యాయవాదులు సుబ్బుశర్మ, ఎంసీ సుబ్రహ్మణ్యం, సత్యజగదీశ్వర్, చంద్రశేఖరశాస్త్రికు న్యాయమూర్తులు, న్యాయవాదులు బుధవారం సంతాపం తెలిపారు. జిల్లా కోర్టు హాల్‌లో నిర్వహించిన సంతాప సభలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏపీబార్ కౌన్సిల్ సభ్యుడు ఉమామహేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల జీవిత విశేషాలను వివరించారు. న్యాయమూర్తుల తరఫున జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని సంతాపాన్ని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రంగనాథుడికి రూ.20.78లక్షల రాబడి



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలో కొలువైన శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి హుండీ కానుకలు, బ్రహ్మోత్సవ టికెట్ల విక్రయం ద్వారా రూ.20,78,850 రాబడి వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలతో పాటు గతేడాది డిసెంబర్ 15 నుంచి ఈ ఏడాది మార్చి 15వ తేదీ వరకు పర్మినెంట్ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు చేపట్టారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.19,00,046 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. అమెరికన్, ఆస్ట్రేలియా,కెనడా, ఇండోనేషియా దేశాలకు చెందిన కరెన్సీ సైతం భక్తులు కానుకగా సమర్పించారని వివరించారు. గతేడాది పోలిస్తే ఈ ఏడాది హుండీ ఆదాయం రూ.7,13,296 పెరిగిందని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,56,450, కల్యాణం చదివింపుల ద్వారా రూ.12,354 ఆదాయం వచ్చిందని వివరించారు. హుండీ కానుకల లెక్కింపును దేవాదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్కే చైతన్య పర్యవేక్షించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్‌ఆచారి, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యానికి గురిచేస్తే చర్యలు



తొలగించిన సైలెన్సర్లతో ట్రాఫిక్ సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు, హారన్లు వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని నార్తుట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మిద్దే నాగేశ్వరమ్మ హెచ్చరించారు. నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్‌సుభాన్ పర్యవేక్షణలో బుధవారం ఆమె తన సిబ్బందితో కలిసి శబ్దకాలుష్యం చేసే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్, ముత్తుకూరుగేటు జంక్షన్, తదితర కూడళ్లల్లో శబ్ద కాలుష్యం చేస్తున్న పదుల సంఖ్యలోని వాహనాల సైలెన్సర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహనాలతో పాటు ఇచ్చిన సైలెన్సర్లను తొలగించి అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్లు బిగిస్తే కేసులు నమోదు చేస్తామని వాహనదారులను హెచ్చరించారు. ఇలాంటి సైలెన్సర్లు విక్రయించే వ్యాపారులు, వాటిని బిగించే మెకానిక్‌లపైన చర్యలు తప్పవన్నారు. స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగుతూ ఉంటుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో నార్త్ ట్రాఫిక్ ఆర్ఎస్ఐలు తిరుమలరెడ్డి, నాగరాజు, ఎస్ఐ గీతారమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న యోగా పోటీలు



యోగాసనాలను ప్రదర్శిస్తున్న మహిళలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ నుంచి మహిళలకు నగరంలోని ఏసీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మహిళలకు రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న యోగా పోటీలు బుధవారం కూడా కొనసాగాయి. 65 మంది మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని సూర్యనమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ ఆకృతుల్లో యోగాసనాలు చేసి అలరించారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఆర్కే యతిరాజ్ మాట్లాడుతూ యోగాతో శారీరక దృఢత్వంతో పాటు మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. మానసిక ఆనందం కోసం యోగా ఉత్తమమైందన్నారు. క్రీడా పోటీలను సెట్నెల్ సీఈఓ పుల్లయ్య పర్యవేక్షిస్తున్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ఆయుష్ (ఆయుర్వేదం, న్యాచురోపతి, హోమియోపతి)ఆధ్వర్యంలో యోగాసనాలతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు మూలాపేటలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల్లో మనోనిబ్బరాన్ని, మానసికోల్లాసాన్ని పెంపొందించేందుకు యోగా మాస్టర్స్ ప్రసన్నకుమార్, ఎంపీ సుకన్య, సలీనా ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు.

అలరించిన ఉడుపి సోదరీమణుల గానం



ఉడుపి సోదరీమణుల గాత్ర కచేరి

నెల్లూరు(బృందావనం): భిక్షాటనా పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో పురమందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్న 58వ త్యాగరాజ స్మరణోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. హరికథలు.. మధుర స్వరార్చనలు, సంగీత విద్వాంసుల గాత్ర కచేరీలతో రసరంజకంగా సాగుతూ సంగీతాభిమానుల మదిని రంజింపజేస్తున్నాయి. వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి స్మరణోత్సవాల్లో నాల్గోరోజైన బుధవారం రాత్రి చెన్నైకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు అర్చన, సమన్వి(ఉడుపి సోదరీమణులు) తమ గాత్రంతో సంగీతప్రియులను అలరించారు. శోభిల్లు సప్తస్వర (జగన్మోహిని రాగం,రూపకతాళం), ఎంత సౌఖ్యమా(కపిరాగం, ఆదితాళం), ఓ రంగశాయి (కాంభోజిరాగం,ఆదితాళం),తదితర త్యాగయ్య కీర్తనాల ఆలాపనతో సభికులను మైమరిపించారు. ఉడుపి సోదరీమణుల గాత్రానికి సీఎస్ చిన్మయి(వయోలిన్), జీపీ సూర్యనంబీసన్(మృదంగం),ఎస్.రాజారామ్(ఘటం)పై వాద్యసహకారం అందించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు కథకులు పరాయితం నారాయణాచార్యచే భక్త త్యాగరాజ చరిత్ర హరికథ గానం, బుర్రా పద్మనాభ శర్మ భాగవతార్‌చే భక్త రామదాసు హరికథ గానం చేశారు. సాయంత్రం 4నుంచి రాత్రి 7గంటల వరకు స్థానిక ఔత్సాహిక కళాకారులు గాత్ర, వీణ కచేరీలు చేశారు. స్వామి వారు వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్మరణోత్సవ సభ కమిటీ అధ్యక్ష, శాశ్వతకార్యదర్శులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, ఎనమండ్ర నాగదేవిప్రసాద్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన జిల్లావాసులు



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు, పవన్‌కుమార్

నెల్లూరు(బారకాసు): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. పూమ్సే, క్యోరుగి విభాగాల్లో రాణించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాసులు, కోశాధికారి పవన్‌కుమార్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా యలమంచిలిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 49 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో పూమ్సే పెయిర్‌లో జీ కృష్ణ, జిషిత, జీ రంగనాథరెడ్డి విజేతలుగా నిలిచారని వివరించారు. పూమ్సే గ్రూప్‌లో చందు, హనీష్, రంగనాథ్‌రెడ్డి ప్రథమ బహుమతి దక్కించుకున్నారని తెలిపారు. క్యోరుగిలో సబ్‌జూనియర్ అండర్-27 వెయిట్ కేటగిరిలో చందు, అండర్-35 వెయిట్ కేటగిరిలో జి.రంగనాథ రెడ్డి విజేతలుగా నిలిచారని వివరించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు రాజస్థాన్ రాష్ట్రం కోటలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన క్రీడాకారులు, కోచ్‌లు, తల్లితండ్రులను అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, న్యూఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అచ్యుత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వేణుగోపాలరావు, కోచ్‌లు సాయి, అస్రాఫ్, ప్రవీణ్‌కుమార్, లీలా మునికుమారి, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్‌కార్నర్

వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మహిళా కమిషన్ సభ్యురాలిని కించపరిచే విధంగా సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిని బాలాజీనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌లో నిందితుడి వివరాలను వెల్లడించారు. నగరానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ రాధామాధవిపై శ్రీనివాసులనాయుడు అనే వ్యక్తి ఓ న్యాయవాది సమక్షంలో దౌర్జన్యం చేశారు. ఆమెకు మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల వెంకటలక్ష్మి అండగా నిలిచారు. ఈ క్రమంలో లక్ష్మిని కించపరిచే విధంగా ఫేస్‌బుక్‌లో బాబీభగత్ అకౌంట్ నుంచి పోస్టులు వచ్చాయి. దీంతో ఆమె ఈ నెల 10న బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ కేసు విచారణ చేపట్టారు. న్యాయవాదుల అనుచరుడైన రామయ్యబడి ప్రాంతానికి చెందిన ఏ నాగవెంకట సాయి మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఉద్దేశపూర్వకంగా పోస్టింగులు పెట్టినట్లు వెల్లడించడంతో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..టీపీ గూడూరు మండలం వరిగొండకు చెందిన షేక్ అబ్దుల్ సలాం ఈ నెల 8న డైకస్‌రోడ్డు ఎన్‌టీటీ కాలనీలోని స్నేహితుడు భాగ్యరాజు ఇంటి ముందు తన స్ప్లెండర్ బైక్ పార్క్‌చేసి లోనికి వెళ్లారు.కొద్దిసేపటి తర్వాత వచ్చిచూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

నెల్లూరు(క్రైమ్): బుజబుజనెల్లూరుకు చెందిన రమీజా బుధవారం జాతీయరహదారి దాటుతుండగా కారు ఢీకొంది. ఆమె డివైడర్‌పై పడడంతో స్వల్పగాయాలయ్యాయి. ఆమెను స్థానికులు 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు.

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కొందరు హత్యాయత్నం చేసిన ఘటనపై సంతపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు..కోటమిట్టకు చెందిన షాహుల్ హమీద్ పెద్దమార్కెట్‌లో మటన్‌షాపులో పనిచేస్తున్నారు. ఆయనకు గతంలో సందానీ, మసూద్, కోటప్ప అలియాస్ ఫైరోజ్, తదితరులతో పాతగొడవలున్నాయి. వారు ఎలాగైనా షాహుల్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా కొద్దిరోజులుగా షాహుల్‌తో కోటప్పతో సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న షాహుల్‌కు కోటప్ప ఫోన్‌చేసి మద్యం సేవించేందుకు సంతపేట పార్లుకట్ట వద్దకు రమ్మని కోరాడు. హమీద్ అక్కడికి వెళ్లగా సందానీ, మసూద్, కోటప్ప మారణాయుధాలతో దాడిచేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన షాహుల్ వారి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితుడు బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

కమిషనర్‌పై దురుసు ప్రవర్తన

• నిందితుడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): కార్పొరేషన్ కమిషనర్‌పై దురుసుగా ప్రవర్తించడంతో పాటు సోషల్‌మీడియా వేదికగా నిత్యం నిరాధార ఆరోపణలు, బెదిరింపు చర్యలకు పాల్పడుతోన్న ఓ వ్యక్తిపై దర్గామిట్ట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు..శ్రేశిత టెక్నాలజీస్ ఎండీ కే నర్మదారెడ్డి టౌన్‌ప్లానింగ్ విభాగంలో భవన అనుమతులకు సంబంధించిన పనిఉంది. ఈ విషయమై హైకోర్టులోనూ ఆయన కేసు వేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో, ఈ నెల 7న ఆయన కమిషనర్ డీ హరిత చాంబర్‌లోకి అక్రమంగా ప్రవేశించి తన ఫైల్‌ను క్లియర్ చేయకపోతే అంతుచూస్తానని బెదిరింపు చర్యలకు పాల్పడ్డారు. సోషల్ మీడియాలో అసత్యప్రచారాలు చేయడంతో పాటు ప్రెస్‌మీట్లు పెట్టి ప్రతిష్టకు భంగం కలిగిస్తానని వాట్సప్ మెసేజీలు చేశారు. ఈ మేరకు కమిషనర్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై వివిధ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

వ్యక్తిగత దూషణలు తగవు



విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ ఉద్యోగ సంఘు నాయకులు

నెల్లూరు సిటీ: కార్పొరేషన్ కమిషనర్ హరిత, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులపై నర్మద్‌కుమార్ వ్యక్తిగత దూషణలకు దిగడం సబబు కాదని కార్పొరేషన్ ఉద్యోగ సంఘు నాయకులు మండిపడ్డారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఉద్యోగ సంఘు నాయకులు చక్రపాణి, చిన్నబాబు మాట్లాడుతూ నర్మద్‌కుమార్ గతంలో రెండు భవనాలకు టౌన్‌ప్లానింగ్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అందులో ఒక భవనానికి అనుమతులు రాగా , రెండో భవనానికి నిబంధనల ప్రకారం అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో నర్మద్‌కుమార్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులపై వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు. భవన అనుమతుల విషయమై నర్మదకుమార్ కోర్టుకు వెళ్లగా, కౌన్సిల్‌లో ఆమోదించి సుడాకు పంపించాలని సూచించిందన్నారు. అయినా అధికారులపై వ్యక్తిగత దూషణలకు దిగడం దారుణమన్నారు. ఉద్యోగులు ప్రజాసేవకులని తెలిపారు. చట్టప్రకారమే తాము విధులు నిర్వహిస్తామని, చట్టవిరుద్ధ పనులు చేయమన్నారు. కమిషనర్ హరిత, కార్పొరేషన్ ఉద్యోగులకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, హెల్త్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'అమరజీవి'కి కళాంజలి



అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని నగరంలోని హరనాథపురానికి చెందిన ఉపాధ్యాయుడు, కళాకారుడు సోమా పద్మారత్నం కళాత్మకంగా అంజలి ఘటించారు. ఎండిన క్రోటన్ ఆకుపై కార్వింగ్‌తో ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం అసువులు బాసిన ''అమరజీవి'' చిత్రాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దారు.

-నెల్లూరు(బృందావనం)